

మహిళలకు ప్రోత్సాహం

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మహిళా సాధికారికతకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా అమరావతి నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. మహిళలను మహాశక్తిగా, అన్ని రంగాల్లో మహిళా సాధికారతను ప్రోత్సహించే విధంగా కూటమి ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మహిళ సమానత్వం కోసం, సాధికారత కోసం, హక్కుల పరిరక్షణ కోసం ఆది నుంచి కృషి చేస్తుంది టిడిపి అని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వయంగా రూపుదిద్దించిన స్వర్ణాంధ్ర విజన్ -2047 డాక్యుమెంట్‌లో సైతం మహిళా సాధికారత, క్షేమం, భద్రతకు ప్రాముఖ్యత ఇచ్చారని అన్నారు. ఈ సందర్భంగా మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

మహిళా సాధికారతే లక్ష్యం

ఇన్‌ఛార్జి మంత్రి శ్రీనివాస్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో ప్రతి ఇంటి నుంచి ఒక మహిళా పారిశ్రామికవేత్త తయారు కావాలని, అదే వెలుగు 2.0 లక్ష్యమని జిల్లా ఇన్‌ఛార్జి, పరిశ్రమలు, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన శనివారం నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్లో ఐసిడిఎస్ ఆధ్వర్యాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల భాగస్వామ్యం లేకుండా ప్రగతి సాధ్యం కాదని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎల్లప్పుడూ విశ్వసిస్తారని గుర్తుచేశారు. పురుషులతో సమానంగా మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళలకు వంటింటికి పరిమితం కాకుండా పొదుపు అలవాటు చేసి డ్వాక్రా సంఘాలను స్థాపించిన ఘనత చంద్రబాబుదేనని గుర్తు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పనిచేసే చోట మహిళా ఉద్యోగులు వేధింపులకు గురైతే హెల్ప్‌లైన్ 181 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు. సఖీ కేంద్రం, వన్‌స్టాప్ సెంటర్ ఆధ్వర్యాన సమాజంలో మహిళలు, బాలికలు మానసిక, శారీరక హింసలకు గురవుతున్న వారికి అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కూన రవికుమార్, బగ్గు రమణమూర్తి, గౌతు శిరీష మాట్లాడారు. వితంతువులకు, పేద మహిళలకు, వృద్ధులకు, ఒంటరి మహిళలకు పింఛన్లు ఇచ్చిన ఘనత చంద్రబాబుదేనన్నారు. ప్రతి ఇంటికీ గ్యాస్ సౌకర్యం కల్పించామన్నారు. ఇప్పుడు ఏడాదికి మూడు సిలిండర్లు ఉచిత గ్యాస్ అందిస్తున్నామని తెలిపారు. ఉగాది నుంచి ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం పోలీసు శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్లలో మహిళల ఫిర్యాదులు స్వీకరించడానికి మహిళా సెల్‌ను ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. చట్టంపై అవగహన పెంచుకుని అవసరమైన వారు తక్షణ సాయం పొందాలన్నారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలకు మంత్రి పురస్కారాలను అందజేశారు. అనంతరం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు దుశ్శాలువ కప్పి సన్మానించి మెమోంటోను అందజేశారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న 1674 స్వయం సహాయక సంఘాలకు రూ111.51 కోట్ల స్త్రీ నిధి రుణాలను లబ్ధిదారులకు అందజేశారు. వీటితో పాటు మెప్మా పరిధిలో 129 సంఘాలకు రూ.9.72 కోట్లు బ్యాంకు లింకేజీ రుణాలు పంపిణీ చేశారు. అలాగే వికలాంగులైన బాలికలకు లాప్‌టాప్‌లను అందజేశారు. జిల్లాలో బేసిక్ టైలరింగ్ శిక్షణకు రూ.8.5 కోట్లు చెక్కును వివిధ సంక్షేమ పథకాల చెక్కులను అందజేశారు. అనంతరం ఫంక్షన్ హాల్ ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కూన రవికుమార్, బగ్గు రమణమూర్తి, గౌతు శిరీష, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, శ్రీకాకుళం ఆర్‌డిఒ సాయి ప్రత్యూష, సిపిఒ ప్రసన్నలక్ష్మి, ఐసిడిఎస్ పీడీ శాంతిశ్రీ, వ్యవసాయశాఖ అధికారి కోరాడ త్రినాథస్వామి, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, డిఎంహెచ్‌ఒ బాలమురళీకృష్ణ, బిసి కార్పొరేషన్ ఇడి గడ్డెమ్మ, వికలాంగుల శాఖ ఎడి కె.కవిత, బిసి సంక్షేమ శాఖ అధికారి ఇ.అనురాధ పాల్గొన్నారు.



పలాస ఎమ్మెల్యే శిరీషకు మెమోంటోను అందజేస్తున్న మంత్రి, కలెక్టర్



మాట్లాడుతున్న పూర్వ ఎమ్మెల్సీ శర్మ

స్త్రీ సమానత్వానికి కృషి

పూర్వ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ

ప్రజాశక్తి -శ్రీకాకుళం అర్బన్

స్త్రీ సమానత్వానికి కృషి చేయాలని పూర్వ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యుటిఎఫ్), సిఐటియు, ఎస్‌ఎఫ్‌ఐ, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు డి.ధనలక్ష్మి అధ్యక్షతన శనివారం సభ నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడుతూ మహిళలపై, చిన్నారులపై జరుగుతున్న హింసను అరికట్టాలన్నారు. పురుషాధిక్య భావజాలం దోపిడీ సమాజంలో భాగమని అన్నారు. స్త్రీలపై ఆధిపత్యం కుటుంబ హింసను పెంచుతోందని, ఫలితంగా స్త్రీలు, పిల్లలు హింసకు గురవుతున్నారని అన్నారు. పైగా కుటుంబ నిర్వహణ భారం కూడా మహిళలపైనే పడుతోందన్నారు. ధరల పెరుగుదల, ఉపాధి లేమి కారణంగా తక్కువ వేతనాలకు పని చేయాల్సి వస్తోందని అన్నారు. పురుష ఆధిపత్యాన్ని పెంచే సంస్కృతి ప్రమాదకరంగా విస్తరిస్తోందని తెలిపారు. ఇంటి పనిని స్త్రీల పని అని భావించడం వల్ల ఆ పనికి విలువ లేకుండా పోతుందన్నారు. స్త్రీ ఇంటి పనికి ఎంతో విలువ ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారుల లాభాల కోసం మహిళా హక్కులను తక్కువ చేయడాన్ని ప్రశ్నించాలని అన్నారు. అణచివేతను ఎదుర్కొని, అంతర్జాతీయ శ్రామిక మహిళల పోరాటాల స్ఫూర్తితో సమాన హక్కుల సాధన కోసం కదలాలని పిలుపునిచ్చారు. పనిప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు అన్ని స్థాయిల్లోనూ ఏర్పాటు చేయాలన్నారు. లైంగిక వేధింపుల నిరోధక చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేసారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు, స్కీమ్ వర్కర్లను రెగ్యులర్ చేసి కనీస వేతనం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లండ బాబూరావు, బమ్మిడి శ్రీరామ్మూర్తి, మహిళా విభాగం జిల్లా కన్వీనర్ కె.శాంతిప్రియ, శ్రామిక మహిళా కో-కన్వీనర్ అల్లు మహాలక్ష్మి, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి గొంటి గిరిధర్, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు పి.తేజేశ్వరరావు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు పవిత్ర, కార్యదర్శి డి.చందు, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి, సిఐటియు నాయకులు ఆర్.ప్రకాష్, టి.ప్రవీణ పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న మహాలక్ష్మి

ప్రజాశక్తి- లావేరు


మహిళలపై పనిప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలని ఎపి శ్రామిక మహిళా జిల్లా కో-కన్వీనర్ అల్లు మహాలక్ష్మి, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.వి.రమణ డిమాండ్ చేశారు. మహిళ దినోత్సవం సందర్భంగా లావేరులో మహిళలపై 'పనిప్రదేశాల్లో లైంగిక వేధింపులు- ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు' అనే అంశంపై సదస్సును నిర్వహించారు. అంగన్వాడీ జిల్లా సీనియర్ నాయకులు కె.సుజాత, మధ్యాహ్నన భోజన కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ఉత్తర అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలపై వేధింపులను అరికట్టేందుకు చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. లైంగిక వేధింపుల నిరోధక కమిటీలను ఏర్పాటు చేసి జిల్లా కో-అధికార్లను నియమించాలన్నారు. సినిమాల్లో, టివి సిరియల్లో అశ్లీలతలను విచ్చలవిడిగా ప్రదర్శిస్తున్నారని, వాటి ప్రభావం సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతోందని దుయ్యబట్టారు. మహిళలు, పసిపిల్లలపై జరుగుతున్న హింసను అరికట్టాలని డిమాండ్ చేశారు. అందరికీ ఉపాధి కల్పించాలని, గౌరవంగా జీవించే అవకాశాలు కల్పించాలని కోరారు.

కమిటీ కనీస వేతనాలు ఇవ్వాలని, మహిళా ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశా, అంగన్వాడీ తదితర స్కీమ్ వర్కర్స్‌ను రెగ్యులర్ చేయాలన్నారు. పెన్షన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. ధరలను అదుపు చేయాలన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు ఎల్.లక్ష్మి, అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మిక సంఘాం నాయకులు పి.దేవి, యు.వజ్రవమ్మ, టి.శ్యామల, ఎన్.కుమారి, కె.సుర్యకూమారి, యు.సుజాత, ఇ.కళావతి, ఎల్.అప్పచ్చమ్మ, వై.కృష్ణవేణి, టి.సత్యవతి, గౌరీశ్వరి, టి.సత్యవతి, ఎ.కోందడమ్మ పాల్గొన్నారు.

లైవ్ ధ్రువపత్రాల మంజూరుకు గడువు పెంపు

ప్రజాశక్తి- టెక్కలి

విశ్రాంత ఉద్యోగులకు అవసరమైన లైవ్ ధ్రువపత్రాల మంజూరుకు ఈ నెల 20 వరకు గడువు పొడగించామని విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షులు రోణంకి రామచంద్రరావు తెలిపారు. సంఘ భవనంలో శనివారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడువు పొడిగించడం వల్ల సబ్‌ట్రజరీ కార్యాలయానికి వెళ్లి తమ పత్రాలు అందజేయాలన్నారు. సీనియర్ సిటిజన్లకు గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నామని తెలిపారు. ఆదాయపు పన్ను చెల్లింపు విషయంలో విశ్రాంత ఉద్యోగులకు ఉన్న సందేహాలను నివృత్తి పరిచారు. సంఘ కార్యదర్శి కూర్మాన దనుంజయరావు వార్షిక నివేదిక అందించారు. కోశాదికారి బొడ్డ అయ్యబాబు ఆర్థికపరమైన లావాదేవీలు నివేదించారు. అనంతరం నూతన సభ్యులుగా రట్టి ఆదినారాయణ, పొట్నూరు సూర్యనారాయణలకు సభ్యత్వం అందించారు. సమావేశంలో సంఘ నిర్వాహకులు గుజ్జు వెంకటరెడ్డి, కుప్పిలి కామేశ్వరరావు, హనుమంతు నాగేశ్వరరావు, మూల తాతయ్య, దూసి ఆంధ్రాస్టాలిన్, కోరాడ మోహనరావు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

లోక్‌అదాలత్‌లో 2,212 కేసులు రాజీ

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి- శ్రీకాకుళం లీగల్

జిల్లా మొత్తంపై జాతీయ లోక్ అదాలత్‌లో 2212 కేసులు రాజీ అయ్యాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సివిల్ కేసులు 127 ద్వారా రూ.5,39,38,448, 2074 క్రిమినల్ కేసులు ద్వారా రూ.1,49,84,348, 11 ఫ్రీ లిటిగేషన్ కేసుల ద్వారా రూ.21,27,300 రాజీ అయినట్లు పేర్కొన్నారు. ఈ లోక్ అదాలత్‌లో కచ్చిదారులకు ఆహారం, నీరు సదుపాయాన్ని జి.ఇందిరాప్రసాద్, శ్రీజయ కుమార్, స్టార్ వనిత క్లబ్ వర్కర్స్ ప్రతినిధి శాంతి సౌజన్యంతో అందజేశారు. ఈ అదాలత్‌లో జడ్జిలు ఎం.ఫణి కుమార్, వై.యుంగధర్, జమ్రత్ బేగం, జి.సువర్ణరాజు, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు పాల్గొన్నారు.



అధికారులను ప్రశ్నిస్తున్న సాయికృష్ణ

ప్రోటోకాల్ ఉల్లంఘించడం తగదు

మండల ప్రత్యేక ఆహ్వానితుడు సాయికృష్ణ

ప్రజాశక్తి- పలాస

మండలంలోని అధికారులు, కూటమి నాయకులు యథేచ్ఛగా ప్రోటోకాల్ ఉల్లంఘిస్తున్నారని, ప్రజాప్రతినిధులు అంటే అధికారులకు, అధికార పార్టీ నాయకులకు అంత చులకనా? అని మండల ప్రత్యేక అహ్వానితులు ఉంగ సాయికృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి ఉంగ ప్రవీణ అధ్యక్షతన శనివారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో చేపడుతున్న శంకుస్థాపనకుల, ప్రారంభోత్సవాలకు ప్రజాప్రతినిధులను పిలవకుండా ఫొటోకాల్ ఉల్లంఘిస్తున్నారని అన్నారు. ప్రజల డబ్బులతోనే ఏ ప్రభుత్వమైనా అభివృద్ధి పనులు చేస్తుందని అన్నారు. అటువంటిది ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులకు పిలవకుండా ఎందుకు అవమానిస్తున్నారని ప్రశ్నించారు. వైస్ ఎంపిపి తలగాన శ్రీరాములు మాట్లాడుతూ ఇప్పటి వరకు పూర్తిస్థాయి ధాన్యం ఎందుకు కొనుగోలు చేయలేదని ఎఒ పోలారావును ప్రశ్నించారు. కొన్ని గ్రామాల్లో జలజీవన్ మిషల్ పైపులైన్లు పనులు చేపట్టలేదని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ధనుంజయరావు సమాధానం చెప్పాలని కోరారు.

డిటి మాట్లాడుతూ పత్రాలు లేని భూముల్లో రీ సర్వేలో సరిచేయమని అన్నారు. దీనిపై బొడ్డపాడు సర్పంచ్ తామాడ మదన్ మాట్లాడుతూ ఉద్దానంలో చాలా మందికి పత్రాలు లేవని, రెవెన్యూ సదస్సులో సరిచేయకపోతే సదస్సులు పెట్టడం దేనికని ప్రశ్నించారు. రెంటికోట సర్పంచ్ శాసనపురి తిరుమలరావు మాట్లాడుతూ రెంటికోటలో పైపులైన్ పనులు పనులు పూర్తికాలేదని, ట్యాంకర్లు శిథిలావస్థకు చేరుకున్నాయని సభ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మహిళాదినోత్సవం సందర్భంగా డిటి సునంద, మహిళా జర్నలిస్టు మేఘనకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.వసంతకుమార్, ఇఒపిఆర్‌డి ఎం.వైకుంఠరావు, ఎంఇఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలు లేని సమాజాన్ని నిర్మిద్దాం

ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మాదకద్రవ్యాలు లేని సమాజాన్ని నిర్మించేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి పిలుపునిచ్చారు. ఎచ్చెర్లలో ఆర్‌జియుకెటిలో టెక్నీవర్స్‌లో భాగంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మాదకద్రవ్యాలు నివారణకు 'సంకల్పం' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాలకు బానిస కావడంతో యువత, విద్యార్థులు జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎంతో గొప్పవాళ్లను చేయాలనే ఆశతో ఉంటే... కొంత మంది యువత డ్రగ్స్‌కు అలవాటుపడుతున్నారన్నారు. ప్రతిఒక్కరూ మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. డ్రగ్స్ సరఫరా చేసేవారి ఆట కట్టించడానికి పోలీస్ సిబ్బంది సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. ముందుగా డైరెక్టర్ బాలాజీ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ కృష్ణచౌదరి పాల్గొన్నారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న బాలాజీ

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్యంపై శ్రద్ధ వహించి కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని కె.వి.మహేశ్వరరెడ్డి కోరారు. జిల్లా హోంగార్డు విభాగానికి చెందిన టెక్కలి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించిన బిడ్డిక అప్పలస్వామి నిర్వర్తిస్తూ శనివారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో దుశ్శాలువ కప్పి సన్మానించి జ్ఞాపిక అందించి సర్వీస్ ప్రశంసాపత్రం ప్రదానం చేశారు. ఈ నేపథ్యంలో తక్షణ ఆర్థిక చేయూతగా రూ.5 వేలు నగదు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి కె.వి.రమణ, డిఎస్‌పిలు ఎల్.శేషాద్రి, ఆర్‌ఎస్‌ఐలు రమణ, నీలిమ పాల్గొన్నారు.

గంజాయితో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- పాతపట్నం

పాతపట్నంలోని ఆంధ్రా-ఒడిశా అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద 4.596 కేజీల గంజాయిను తరలిస్తున్న ధనుంష్ ఏకాంబరంను శనివారం అరెస్టు చేశామని సిఐ రామారావు తెలిపారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో శనివారం విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. తమిళనాడు రాష్ట్రం తిరువల్లూరు జిల్లాకు చెందిన ధనుష్ ఏకాంబరం కాలేజీలో చదువుతున్నప్పటి నుంచి గంజాయికి అలవాటు పడ్డారని అన్నారు. విశాఖ రైల్వే స్టేషన్ దగ్గర ఒరిశా ప్రాంతానికి చెందిన బల్లిగూడకు చెందిన రాజు దొర అనే వ్యక్తితో పరిచయం ఏర్పడిందన్నారు. పలుమార్లు అతని వద్ద గంజాయి కొని తిరువల్లూరు పోలీసులకు పట్టుబడి జైలు జీవితం అనుభవించారని అన్నారు. మూడు రోజుల కితం రైలు ఎక్కి ఇంటికి వెళ్లి వచ్చి బల్లిగూడా చేరుకుని రాజు భాయ్ ఏర్పాటు చేసిన 4.569 కేజీల గంజాయిని రూ.పది వేలు కొనుగోలు చేశారని అన్నారు. విశాఖ నుంచి చెన్నయ్ రైలు వెళ్తున్నారని అన్నారు. స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద అనుమానం వచ్చి పరిశీలించగా గంజాయి దొరికిందన్నారు. వ్యక్తిని అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐబి లావణ్య, జీవన్ పాల్గొన్నారు.



నిందితుడిని అరెస్టు చేసిన సిఐ రామారావు

కూటమి నేతల రాజకీయ విన్యాసాలు

వీక్షణం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల తర్వాత కూటమి నేతల రాజకీయ విన్యాసాలు నవ్వి పోదురుగాక మాకేటి సిగ్గు అన్న రీతిలో ఉంది. ఫలితాలపై వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మీడియా ముఖంగా చెప్పిన మాటలు, కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు ప్రత్యేక వీడియో సందేశం వీడియో ఇటీవల బాగా వైరల్ అవ్వడం చూశాం. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాము ఎవరినీ అభ్యర్థిగా నిలబెట్టలేదంటూ అచ్చెన్న చెప్తుంటే టిడిపి, జనసేన నిలబెట్టిన పాకలపాటి రఘువర్మను గెలిపించాలంటూ రామ్మోహన్ నాయుడు ఉపాధ్యాయులకు పిలుపు నివ్వడం అందులో ముఖ్యమైన సారాంశం. శ్రీనివాసులు నాయుడు, రఘువర్మకు ప్రథమ, ద్వితీయ ఓట్లు వేయాలని చెప్పినట్లు అచ్చెన్నాయుడు ట్వీట్ చేయడం, రఘువర్మకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని రామ్మోహన్ నాయుడు పిలుపు నివ్వడం పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. గెలిస్తే మా అభ్యర్థి, ఓడితే మా క్యాండెట్ కాదని చెప్పడం కూటమి నేతలకే చెల్లింది. పనిలో పనిగా కూటమి నేతలు, ఏకంగా ఉపాధ్యాయ ఉద్యమాలపైనే దాడికి బరి తెగించారు. వైసిపికి, యుటిఎఫ్‌కు ముడిపెట్టి జుగుప్సాకర రాజకీయాలకు పాల్పడటం కూటమి నేతల దిగుజారుడుతనాన్ని తేటతెల్లం చేస్తోంది. వైసిపి యుటిఎఫ్ ముసుగులో వచ్చిదంటూ అవాక్కులు చెవాక్కులు పేలడం ఉపాధ్యాయ వర్గాలకు ఆగ్రహం తెప్పించింది. ఎన్నికల ముందు ఒక ముసుగు, అధికారంలోకి వచ్చిన తర్వాత మరో ముసుగు వేసుకోవడం కూటమి నేతలకే చెల్లిందంటూ వారు మండిపడుతున్నారు. కూటమి అభ్యర్థిగా బరిలోకి దిగిన పాకలపాటి రఘువర్మ ఓటమిని జీర్ణించుకోలేక ఆ రకమైన వ్యాఖ్యలు చేసినట్లుగా ఉపాధ్యాయవర్గాల్లో చర్చ నడుస్తోంది. మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ వచ్చిన ఓట్లు పరిశీలిస్తే కూటమి ప్రభుత్వపై ఉపాధ్యాయుల్లో అంతర్లీనంగా గూడుకట్టుకున్న ఆగ్రహాన్ని తేటతెల్లం చేస్తోంది. మొత్తం 20,135 ఓట్లు పోలవ్వగా అందులో కూటమి అభ్యర్థి రఘువర్మకు 6,851 ఓట్లే వచ్చాయి. 34 శాతం ఓట్లే సాధించి ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి ఓట్ల సునామీ, ఆదరణ చెక్కు చెదరలేదంటూ నేతలు గొప్పలు చెప్పుకోవడం, వాస్తవ గణాంకాలు విడిచిపెట్టి అంతా బాగుందనుకోవడం ప్రజలను మభ్యపెట్టడమే అవుతుంది. కూటమి 95 శాతం స్ట్రైక్ రేట్, 52 శాతంపైన ఓటింగ్ షేర్ సాధించిందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు తరచూ సభల్లో విజయగర్వంతో చెప్పుండటం మనం చూస్తున్నాం. మరి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ ఓటింగ్ షేర్ ఏమైనట్లు, బాబు బాషలో చెప్పాలంటే ఇది గ్రాఫ్ తగ్గినట్లు కాదా? వైసిపి విధానాలతో విసిగి వేసారిన ఉద్యోగుల్లో భాగమైన ఉపాధ్యాయుల్లో మెజార్టీ ఓటర్లు ఎనిమిది నెలల కాలంలోనే టిడిపి కూటమి ప్రభుత్వంపై విముఖత చూపడం ప్రభుత్వ వ్యతిరేకతకు అద్దం పడుతోంది.

కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు రాజకీయ విన్యాసాలు చూసి క్షణం కొక రంగు మార్చే ఊసరవెల్లి కూడా సిగ్గుపడేలా ఉంది. తాము శ్రీనివాసులు నాయుడికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని చెప్పినట్లు అచ్చెన్న చేసిన ట్వీట్‌కు గాదె కౌంటర్ ఇచ్చారు. అచ్చెన్న తనకు మద్దతిచ్చారా అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తనకు దానిపై అవగాహన లేదు. ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో మాత్రమే తాను గెలిచినట్లు చెప్పుకొచ్చారు. తనకెవరూ మద్దతు ఇవ్వలేదని విశాఖలో చెప్పిన శ్రీనివాసులు నాయుడు అమరావతికి చేరే సరికి ప్లేటు పిరాయించారు. ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి తన విజయానికి సహకరించిన సిఎంకు ధన్యవాదాలు సైతం తెలిపేశారు. ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో గెలిచానని అప్పటివరకు చెప్పిన గాదె ముఖ్యమంత్రి చంద్రబాబు తనకే రెండో ప్రాధాన్యత ఓటు వేయాలని కూటమి పార్టీల నేతలకు సూచించారంటూ శ్రీనివాసులు నాయుడు చెప్పుకోవడానికి ఏమాత్రం సంకోచించలేదు. అప్పటివరకు ఉపాధ్యాయ సంఘాల పక్షమంటూ చెప్పుకొచ్చిన గాదె ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందు వంగి, లొంగి కూటమి నేత అయిపోయారు. ఉద్యమాలకు నాయకత్వం వహించే పలు ఉపాధ్యాయ సంఘాలకు నాయకత్వం వహిస్తున్న గాదె హుందాగా వ్యవహరించకుండా చంద్రబాబుకు పూర్తి సరెండరయిపోవడాన్ని పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు.

ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు ఫక్తు రాజకీయ నాయకుడి మాదిరిగా అప్పుడే అవతారం ఎత్తేశారు. ఉపాధ్యాయ ప్రతినిధిగా ఎన్నికైన ప్రతిసారి పాలక పార్టీల పక్షాన చేరిపోవడం ఆయన నైజం. ఇప్పుడు అదే పని చేశారు. కూటమి పక్షాన చేరిపోయి బాబు ఆశీస్సులను అందుకున్నారు. గత వైసిపి ప్రభుత్వంపై నిందలు వేస్తూ కూటమి నేతలను పొగడ్తలతో మచ్చిక చేసుకోవడం మొదలు పెట్టేశారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా, వెంకయ్యానాయుడు కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సమన్వయం చేసి ఏకీకృత సర్వీసు నిబంధనలను తీసుకొచ్చానంటూ గొప్పలు చెప్పడంపై ఉపాధ్యాయులు నవ్వుకుంటున్నారు. ప్రభుత్వం మారాక అది ముందుకెల్లకుండా ఎక్కడిక్కడ ఆగిపోయిందంటూ టిడిపి ఏదో మేలు చేసినట్లు చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారితే కేంద్రంలో బిజెపి, బిజెపికి మద్దతు ఇచ్చే వైసిపి లేవా? అప్పుడు ఎందుకు చేయలేకపోయారని అంటూ ఉపాధ్యాయులు ప్రశ్నలు సంధిస్తున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వ హయాంలో సిపిఎస్ రద్దుకు కృషి చేస్తానని గాదె చెప్పడం పెద్ద జోక్‌గా ఉపాధ్యాయ వర్గాలు అభివర్ణిస్తున్నాయి. సిపిఎస్ రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుండా మోసం చేయడం వల్లే 2019లో టిడిపి ఓడిపోయిందన్న విషయం గాదె మరిచినట్లు ఉన్నారు. ఏ ప్రభుత్వం ఉంటే ఆ పక్షాన చేరిపోవడం, ఉపాధ్యాయ సమస్యలపై పోరాడుతానని చెప్పడం శ్రీనివాసులు నాయుడుకు ఇది కొత్తేమి కాదు. ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో గెలిచి టిడిపి కూటమి పక్షాన గాదె చేరినా వారి సమస్యలపై నిరంతరం పోరాటానికి తాముమన్నంటూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (ఎపి యుటిఎఫ్) ఎప్పుడూ సిద్ధంగా ఉండనే ఉంది. ప్రజాస్వామ్యంలో గెలుపోటములతో నిమిత్తం లేకుండా పనిచేసే పిడిఎఫ్ (ప్రొగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్) ఎప్పటి మాదిరిగానే విద్య, ఉపాధ్యాయ రంగ సమస్యలపై పోరాటాలకు భవిష్యత్ కార్యాచరణను సిద్ధం చేసుకుంటోంది.



ఘనంగా మహిళా దినోత్సవం


శ్రీకాకుళం అర్బన్ : అలంకార సామగ్రిని అందజేస్తున్న డాక్టర్ శ్రీధర్


లావేరు : మహిళలను సన్మానిస్తున్న సురేష్ తదితరులు


పలాస : ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు


మెళియాపుట్టి : ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

స్త్రీ జగత్‌కు మూలం. జననం మొదలు గమనం వరకు అన్నింటా తానై తల్లి, చెల్లి, భార్య, కుమార్తె, అత్త, అమ్మమ్మ, నాన్నమ్మ ఇలా అనేక రూపాల్లో మూర్తీభవిస్తున్న సృష్టికర్త మహిళ. 1906 మార్చి 8న అమెరికాలో మహిళలు ఉద్యోగాల్లో సమాన అవకాశాలు కావాలని, వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ భారీ నిరసన చేపట్టారు. ఈ చారిత్రాత్మక నేపథ్యాన్ని పురస్కరించుకుని ఏటా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. అందులో భాగంగా శ్రీకాకుళం నగరంలో పలు స్వచ్ఛంద సంస్థలు, పని ప్రదేశాలు, వివిధ పక్షాలు ఎవరికి వారుగా మహిళాదినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో వివిధ రంగాల్లో నైపుణ్యం కలిగి వృత్తిలో రాణిస్తున్న మహిళలను ఘనంగా సత్కరించారు.

ఎస్‌టియు ఆధ్వర్యాన...

నగరంలో క్రాంతి భవన్‌లో ఎస్‌టియు ఆధ్వర్యాన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలకు ఎస్‌టియు జిల్లా మహిళా కార్యదర్శి పి.వసంత కుమారి అధ్యక్షత వహించారు. పార్వతీపురం మన్యం జిల్లా మహిళా కార్యదర్శి బి.ఇందిర ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్‌టియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌విరమణ, జి.రమణలు హాజరై పలువురు మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు.

మెడికవర్ ఆస్పత్రిలో...

నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో ప్రముఖ స్త్రీ వైద్య నిపుణులు డా.దానేటి శ్రీధర్ హాజరై మహిళా ఉద్యోగులకు గాజులు, ఇతర అలంకార సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతం నుంచి అంతర్జాతీయ స్థాయికి ఇటీవల అంతరిక్ష స్థాయి వరకు మహిళలు ఎదిగారని కొనియాడారు. కార్యక్రమంలో మెడికవర్ హెచ్‌ఆర్ దిలీప్, నర్సింగ్ సూపరింటెండెంట్ చంద్రకళ, పొన్నాడ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

తూర్పుకాపు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన...

నగరంలోని తూర్పుకాపు సంక్షేమ భవనంలో ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో సంఘ అధ్యక్షులు సురంగి మోహనరావు, డాక్టర్ ఎం.రామజోగినాయుడు, పడాల తమ్మినాయుడు, అంకడాల తవిటన్న, కురిటి దుర్గారావు, మక్కా శ్రీనివాసరావు, లావేటి సుందరరావు, శాసపు జోగినాయుడు, రాడ కైలాసరావు, కొమ్ము రమణమూర్తి, మామిడి క్రాంతి, పతివాడ సురేష్ పాల్గొన్నారు.

జిఎన్‌వి జ్యూయలర్స్ ఆధ్వర్యాన 3కె రన్...

మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని 80 అడుగుల రోడ్డులో జిఎన్‌వి జ్యూయలర్స్ ఆధ్వర్యాన 3కె రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నియోజక వర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు గొండు స్వాతి శంకర్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పైడి శెట్టి జయంతి తదితరులు హాజరై 3కె రన్‌ను ప్రారంభించారు. నగరంలోని మహిళలు ఈరన్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో వైద్యనిపుణులు డా. పైడి సింధూర, డా. కింజరాపు షర్మిళ. జిఎస్‌వి ఎండి బోయిన నిర్మల హాజరై వివిధ పోటీల్లో పాల్గొన్న మహిళలకు బహుమతులు అందజేశారు. ముందుగా కూచిపూడి నృత్య దర్శకురాలు నీరజా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యాన నృత్య రూపకాలను ప్రదర్శించారు.

జోయ్‌కిడ్స్ ప్లే స్కూల్‌లో

ఉద్యోగం, వ్యాపారం, రాజకీయం, సేవా రంగం, పారిశ్రామిక, సాంకేతిక రంగాల్లో మహిళలు సత్తా చాటుతున్నారని జోయ్‌కిడ్స్ స్కూల్ కరస్పాండెంట్ జామి శ్రవంతి అన్నారు. స్కూల్‌లో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారులు వివిధ వేషదారణలను ప్రదర్శించారు.

రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో

రెవెన్యూ అతిధి గృహంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ క్రీడలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డిఆర్‌ఒ వెంకటేశ్వరరావు, రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు కె.శ్రీరాములు, మహిళా విభాగం చైర్మన్ ప్రవల్లిక ప్రియ బహుమతులు అందజేశారు.

స్వీప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో

నగరంలోని స్వీప్ కార్యాలయంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. డైరెక్టర్ పొమ్ము రమణమూర్తి ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మహిళలు సిహెచ్ రామలక్ష్మి, ఈశ్వరమ్మ, పావణిలను సన్మానించారు.

లావేరు: సృష్టికి మూలం స్త్రీమూర్తేనని ఎచ్చెర్ల నియోజకవర్గ టిడిపి నాయకులు ముప్పిడి సురేష్ అన్నారు. లావేరులో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అలాగే బెజ్జిపురంలో యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి పలువురు మహిళలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ అధ్యక్షులు, గ్రామ సంఘాల అధ్యక్షులు, విఒఎలు, బుడతవలస ఎంపిటిసి ముళ్ల సాయికుమార్, ఆర్.శ్రీనువాసరావు, చిత్రికి విజయకుమార్, నీలిమా పలువురు మహిళలు పాల్గొన్నారు.

ఆమదాలవలస : మహిళలు సమాజానికి మార్గదర్శకులు అని పురపాలక సంఘ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ అన్నారు. పురపాలక సంఘ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్ లెవెల్ ఫెడరేషన్ అధ్యక్షులు పొట్నూరు పద్మావతిని కమిషనర్ సన్మానించారు. కార్యక్రమంలో మహిళా సంఘ సభ్యులు, ఆర్‌పిలు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: ఐకెపి భవనంలో మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు పేడాడ మణమ్మ కేకు కట్ చేసి మహిళా దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఎపిఎం గోవిందరాజులు, ఎంఎంఎస్ సభ్యులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: అంబేద్కర్ యూనివర్సిటీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ రజని, కంచరాన భుజంగరావు, డాక్టర్ కె.ఉదయ్ కిరణ్, బాడాన శ్యామలరావు, పూజారి దివాకర్, శ్రీనివాసు, పి.సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: మండలంలోని బంటుపల్లి పంచాయతీ నడుకుదిటిపాలెంలో ఉన్న ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ తేజబాబు, ప్రెసిడెంట్ రామకృష్ణ, ఎజిఎం మాదవిలత, వైస్ ప్రిన్సిపాల్ జ్యోతి పాల్గొన్నారు.

పోలాకి : మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి ఇందుకు కూటమి ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా నరసన్నపేట నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, పార్లమెంట్ పార్టీ అధికార ప్రతినిధి గొద్దు చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి అడపా చంద్రశేఖర్, పట్టణ పార్టీ అధ్యక్షులు కింజరాపు రామారావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం : సమాజంలోని మహిళలందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నప్పుడే పరిపూర్ణమైన ప్రగతి సాధించగలమని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని శనివారం పోలీసు కార్యాలయంలో జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న మహిళా పోలీస్ సిబ్బంది, మహిళా పోలీసులకు జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో ఉచితం మెగా మహిళా వైద్య శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అదనపు ఎస్‌పి కె.వి.రమణ, డిఎస్‌పిలు సిహెచ్.వివేకానంద, ఎల్.శేషాద్రి, పైడిపు నాయడు, ఈశ్వరరావు, సత్యనారాయణ, ఎస్‌ఐలు హరికృష్ణ జనార్ధన్, రాము, సందీప్, ప్రవళిక, లక్ష్మి పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి మహిళ పోలీసులు, మహిళ పోలీసు సిబ్బందితో అదనపు ఎస్‌పి కె.వి.రమణ ఆధ్వర్యాన ర్యాలీ డై అండ్ నైట్ కూడలి వరకు సాగి మానవహారంగా ఏర్పడింది. మహిళా సాధికారత, చైతన్యం, ప్రగతి తదితర అంశాలపై జై జై పలికారు. ఇందులో భాగంగా ప్రతి పోలీస్ స్టేషనూ పరిధిలో వ్యాసరచన, డిబేట్, పెయింటింగ్, చిత్రలేఖనం, ఓపెన్‌హౌస్ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డిఎస్‌పిలు సిహెచ్.వివేకానంద, ఎల్.శేషాద్రి, పైడిపు నాయడు, ఈశ్వరరావు, సత్యనారాయణ, ఎస్‌ఐలు హరికృష్ణ, జనార్ధన్, రాము, సందీప్, ప్రవళిక, లక్ష్మి పాల్గొన్నారు.

మెళియాపుట్టి : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సిఐటియు ఆధ్వర్యాన ఆల్ ఆంధ్ర రోడ్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.నాగమణి, కె.సూరయ్య, పోలాకి ప్రసాదరావు, స్వర్ణలత, పద్మ, అమ్మోజీ, కళ్యాణి పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మహిళను గౌరవించాలని టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు అన్నారు. మహిళాదినోత్సవం సందర్భంగా ఐతమ్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కోశాధికారి టంకాల నాగరాజు, డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ వైశ్యరాజు సుధాప్రియా, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కవిటి: మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక మహిళా సమాఖ్య భవనంలో మహిళలు కేక్ కట్ చేశారు. మహిళలకు రంగవల్లికల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఉషోదయ యువజన సంఘం ఆధ్వర్యాన కవిటి సిహెచ్‌సి వైద్యులను, హెడ్ నర్స్, మహిళా సిబ్బందిని సన్మానించారు. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు బెందాళం రమేష్, పాండవ చంద్రశేఖర్, ఆరంగి మధు, ఆరింగి త్రివిక్రమరావు, ప్రగడ మణిబాబు, లక్ష్మి, ఎంపిడిఒ శ్రీనివాస్‌రెడ్డి ఎపిఎం గోవింద్ పాల్గొన్నారు.

నరసన్నపేట : ఎల్‌విఆర్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్ ఎం.ప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ జి.వి.జగన్నాథరావులు దుశ్శాలువ కప్పి సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

ఇచ్ఛాపురం : మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ ఆధ్వర్యాన కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేశారు. 22వ వార్డులో కౌన్సిలర్ కాళ్ల దిలీప్ కుమార్ యాదవ్, పట్టణంలో జ్ఞాన భారతి విద్యా సంస్థల్లో కార్యదర్శి జోహార్ ఖాన్, శాంతి నికేతన్ విద్యా సంస్థల లో చైర్మన్ దక్కత కృష్ణమూర్తిరెడ్డి ఆధ్వర్యాన మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

పలాస : సిఐటియు, ఐద్వా, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ ఆధ్వర్యాన మహిళా దినోత్సవ సందర్భంగా కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్.గణపతి, ఎన్‌జిఒ సంఘ నాయకులు బి.గోపాల్, ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు ఎన్.ఢిల్లేశ్వరి, జె.భాగ్యలక్ష్మి, కె.సుహాసిని, ఆశా యూనియన్ నాయకులు జి.జ్యోతి, మధ్యాహ్న భోజన పథకం నాయకులు పి.భానమ్మ, బి.శశిరేఖ, స్వాతి, ఈశ్వరి పాల్గొన్నారు.

కొత్తూరు : మహిళా దినోత్సవం సందర్భంగా ఎంపిడిఒ నీరజను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సన్మానించారు. కార్యక్రమంలో రామరాజు ట్రస్టు చైర్మన్ పి.రామరాజు పాల్గొన్నారు.

పాతపట్నం: స్థానిక ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో పాఠశాల ఫౌండర్ చైర్మన్ డాక్టర్ జి.రాజేశ్వరరావు అధ్యక్షతన మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో టెక్కలి ఉప ఖజానాధికారి ఎం.భాగ్యలక్ష్మిని సన్మానించారు. కార్యక్రమంలో రచయిత పూతి చంద్రభూషణ్, ఎన్.కొల్లి, టి.ధనుంజయ, ప్రిన్సిపాల్ ఎం.వి.రమణ పాల్గొన్నారు.

టెక్కలి : మహిళా దినోత్సవం సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి మాజీ ఎంపిపి మట్ట సుందరమ్మ, మాజీ సర్పంచ్ బెహరా కృష్ణవేణి, టిడిపి మహిళా అధ్యక్షులు మెండ దమయంతిలను సన్మానించారు. మట్ట పురుషోత్తం, కోళ్ళ లవకుమార్, బసవల అప్పలస్వామి, రెయ్యి ప్రీతీష్‌చంద్, దల్లి ప్రసాద్‌రెడ్డి, ప్రఫుల్ల బరోడా, బెహరా కాళీ పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తుమ్మ వీధి కార్యక్రమాల కమిటీ ఆధ్వర్యాన అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కమిటీ సహకారంతో ఆటల పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి పి.రమ్యారాగిణి మాట్లాడుతూ మహిళలు అనేక సమస్యలు ఇంకా ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో మాధవీలత, లావణ్య, జ్యోతి, కె.శ్రీనివాస్, ఎం.ప్రభాకరరావు, పి.సుధాకరరావు, రమణమూర్తి, రంగప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్ట్ ఆఫ్ లివింగ్ హ్యాపీనెస్ సెంటర్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి డాక్టర్ అమ్మన్నాయుడు, ఎఒఎల్ టీచర్ దేసూళ సురేంద్ర, యోగా టీచర్స్ లాయర్ సుధారాణి, దేసూళ సురేంద్ర, వారణాసిసందీప్, సుచిత్ర, గోవింద్, రవి, శ్రీనివాస్‌రెడ్డి, కాతాయని, అమరావతి, లక్ష్మి పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మహిళా దినోత్సవ సందర్భంగా ఉత్తమ సిసి బి.హరిప్రియ, ఉత్తమ విఒఎ ఎం.సునీత, మండల సమాఖ్య అధ్యక్షులు సరస్వతి, సెక్రటరీ చంద్రకళ, కోశాధికారి కళ్యాణి, సోంపమ్మ, వివోయేలు, అకౌంటెంట్స్ మీనా, సౌజన్యలను లను ఎపిఎం గొడబ ప్రసాదరావు సన్మానించారు.

ఇచ్ఛాపురం : మహిళా దినోత్సవం సందర్భంగా కెజిబివిలో జెసిఐ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన గైనిక్ డాక్టర్ నీలిమా విద్యార్థినులకు పలు సూచనలు అందజేశారు. జెసిఐ అధ్యక్షులు కాళ్ల జయదేవ్, ప్రిన్సిపాల్ శిరీష, ఎఎన్ఎం లక్ష్మి, సభ్యులు షణ్ముఖ, ఢిల్లేషు, దివ్య, డాక్టర్ వాసవి, రేణుక పాల్గొన్నారు.

పర్లాకిమిడి : గజపతి జిల్లా పర్లాకిమిడి మహారాజా పేలస్ వద్ద యుటెక్ ఎడ్యుకేషన్ సెంటర్ ఆవరణలో ప్రగతి మహిళా సంఘం ఆధ్వర్యాన మహిళా దినోత్సవం నిర్వహించారు.


రణస్థలం రూరల్ : కేక్ కట్ చేస్తున్న మహిళలు


శ్రీకాకుళం అర్బన్ : సన్మానిస్తున్న సభ్యులు


పలాస : ఎపిఎం జాంబవతిని సన్మానిస్తున్న నాయకులు


శ్రీకాకుళం : మానవహారం నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది

కార్యక్రమంలో కల్పనా పట్నాయక్, జైళ్ల శాఖ అధ్యక్షులు కామాక్షిప్రసాద్, కార్యక్రమంలో ఇతిశ్రీ మహాపాత్ర, హరిమోహన్ పట్నాయక్, లోకనాథ్ మిశ్రా, డాక్టరు మురుము పాల్గొన్నారు. ఆటలు, పాటలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.

కోటబొమ్మాళి: టిడిపి కార్యాలయంలో మండల అధ్యక్షులు బోయిన రమేష్ మహిళా నాయకులను సన్మానించారు. అలాగే మండలంలోని హరిశ్చంద్రపురంలో కొత్తమ్మతల్లి ఫార్మర్ పొడ్యూషింగ్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యాన నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో కొత్తమ్మతల్లి ఎఫ్‌టిఒ సిఇఒ పూజారి సత్యప్రియ, మాజీ సర్పంచ్ పూజారి శైలజ, సత్యనారాయలు మహిళా డాక్టర్లను సన్మానించారు.

సోంపేట: బారువ పెద్దమ్మ ఆలయం ఆవరణలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో వైద్యులు రాజేంద్రప్రసాద్, తామాడ అరుణ, రోతురోహిణి, గేదెల పద్మావతి, గేదెల విజయలక్ష్మి, బల్ల తులసి, బిసి నాయకులు గేదెల దేవరాజు, యాదవరావు, ఈరోతు శ్రీనివాసరావు, ఇంటి వెనక యుగంధర్, గండు కృష్ణ మూర్తి, బీన రాజేశ్వరి, దుద్ది బానమ్మ, తోట సావిత్రి పాల్గొన్నారు.

పలాస : పలాస వెలుగు కార్యాలయంలో శనివారం మహిళా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల సమాఖ్య అధ్యక్షులు గండుబారికి శాంతమ్మ, మండల సమాఖ్య కార్యదర్శి కె.పార్వతి, కోశాధికారి త్రివేణి, ఎపిఎం జాంబవతి, ఇఒ డ్వాక్రా వెలుగు ఎపిఎం అప్పల నర్సమ్మ, అకౌంటెంట్ కళ్యాణి, అంబిక, సిఎఫ్‌లు యశోద, దామోదర, శేషదేవి, ధనలక్ష్మి, రోహిణి, జగదీశ్వరిలకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వెలుగు సిసిలు ధనలక్ష్మి, నాగమ్మ, సిఎఫ్‌లు ద్రౌపతి, వనజాక్షి, రోహిణి, కవిత, సరస్వతి, ధనలక్ష్మి, జయలక్ష్మి గీతా పండా సావిత్రి పాల్గొన్నారు.

పలాస మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యాన మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కమిషనర్ ఎన్.రామారావులు తదితరులు పాల్గొన్నారు.


చెక్కును అందుకుంటున్న సన్యాసిరావు

రైతు ఉత్పత్తిదారుల కంపెనీకి జాతీయస్థాయి అవార్డు

బూర్జ: మన్యం సహజ రైతు ఉత్పత్తిదారుల కంపెనీకి జాతీయస్థాయి అవార్డు దక్కింది. ఇఎస్ఎఎఫ్ ఫౌండేషన్ మహిళా దినోత్సవం సంధర్భంగా కేరళ రాష్ట్రంలో త్రిస్సుర్ భారత్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఫర్ కలెక్టివ్ ఎంటర్ప్రైజెస్ అవార్డునును న్యూఢిల్లీ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కె.సతీష్ మల్హోత్రా, ఇఎస్ఎఎఫ్ సంస్థ స్థాపకులు పాల్ జోసెఫ్ చేతులమీదుగా ప్రథమ బహుమతిని ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు అందుకున్నారు. ఈ సందర్భంగా రూ.లక్ష ప్రైజ్ మనీ అందుకున్నారు. కంపెనీలో మహిళా రైతులకు అటవీ ఉత్పత్తులైన కొండచీపుర్లు, పైనాపిల్, సీతాఫలం, పసుపు ద్వారా తయారు చేసిన ఉత్పత్తులకు శిక్షణ ఇప్పించి, వస్తు విలువ ఆధారిత అభివృద్ధి మెరుగు పర్చాలనే ఉద్దేశ్యంతో తమ కంపెనీ ముందుకు వెళ్తుందని సన్యాసిరావు తెలిపారు. ఆయనతో మన్యం సహజ కంపెనీ సిఇఒ శంకరరావు ఉన్నారు.

టయోటా హైలక్స్ బ్లాక్ ఎడిషన్ ఆవిష్కరణ

శ్రీకాకుళం: టయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) కొత్త హైలక్స్ బ్లాక్ ఎడిషన్‌ను శనివారం పెద్దపాడు రోడ్‌లో గల టొయోటో షోరూంలో వర్చ్యువల్‌గా విడుదల చేసినట్టు ప్రకటించింది. ఇది ఒడిదుడుకుల రోడ్లు, రోజువారీ నగర వినియోగానికి, ఆఫ్-రోడింగ్ అడ్వెంచర్ డ్రైవ్‌లకు బాగా సరిపోయే అద్భుతమైన జీవనశైలి యుటిలిటీ వాహనాన్ని కోరుకునే కస్టమర్ల కోరికలను తీర్చడానికి. అభివృద్ధి చెందుతున్న కస్టమర్ అంచనాలను కొనసాగించడానికి రూపొందించబడిందని టొయోటా కిర్లోస్కర్ మోటర్ సేల్స్ సర్వీస్ యూజ్డ్ కార్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ వరీందర్ వాధ్వా చెప్పారు. కొత్త హైలక్స్ బ్లాక్ ఎడిషన్ దాని సంప్రదాయ ధృఢత్వం, శక్తి, పనితీరును నిలుపుకుంటూ అధునాతనమైన ఆల్-బ్లాక్ థీమ్‌ను అందించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. హైలక్స్ బ్లాక్ ఎడిషన్‌లో భద్రతకు అమిత ప్రాధాన్యత ఉందని, ఇందులో 7 ఎస్ఆర్ఎస్ ఎయిర్‌బ్యాగ్‌లు, వెహికల్ స్టెబిలిటీ కంట్రోల్, ట్రాక్షన్ కంట్రోల్, ఎలక్ట్రానిక్ డిఫరెన్షియల్ లాక్, అత్యుత్తమ నిర్వహణ నియంత్రణ కోసం ఆటోమేటిక్ లిమిటెడ్ స్లిప్ డిఫరెన్షియల్ ఉన్నాయన్నారు. అదనంగా హిల్ అసిస్ట్ కంట్రోల్, డౌన్‌హిల్ అసిస్ట్ కంట్రోల్, వంపులు, కఠినమైన భూ భాగాలపై మెరుగైన భద్రతను అందిస్తాయన్నారు. ఫ్రంట్ పార్కింగ్ సెన్సార్లు ఇరుకైన ప్రదేశాల్లో సౌలభ్యాన్ని జోడిస్తాయన్నారు. అన్ని టొయోటా డీలర్‌షిప్‌లలో టొయోటా హైలక్స్ బ్లాక్ ఎడిషన్ కోసం బుకింగ్‌లు ఇప్పుడు కస్టమర్ల కోసం తెరిచి ఉన్నాయని, డెలివరీలు మార్చి 2025 నుంచి ప్రారంభం కానున్నాయని చెప్పారు.

నేడు దరఖాస్తుల స్వీకరణ

సంతబొమ్మాళి : ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఇళ్ల కోసం వికలాంగుల నుంచి ఆదివారం దరఖాస్తులను స్వీకరిస్తున్నామని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ద్వారా జిల్లా అధ్యక్షుడు ఆవుల వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు చేరుకోవాలన్నారు. దరఖాస్తుదారులు ఆధార్, రేషన్ కార్డు, సదరం ధ్రువపత్రాల జిరాక్స్‌లు, నాలుగు పాస్‌సైజ్ ఫొటోలు, ఫోన్ నంబరు తీసుకురావాలని తెలిపారు.

పింఛను వెరిఫికేషన్ వాయిదా

లావేరు: మండలంలోని 18 సచివాలయాలకు చెందిన 100 మంది పింఛనుదారుల వెరిఫికేషన్ వాయిదా పడిందని ఎంపిడిఒ పి.వెంకటరాజు శనివారం తెలిపారు. మార్చి 10, 11 తేదీల్లో జరగాల్సిన పింఛన్ వెరిఫికేషన్ వాయిదా పడిందని, పింఛనుదారులు ఎవరు ఆయా సచివాలయలకు వెళ్లవద్దని మరలా ఎప్పుడు వెళ్లలో త్వరలో చెపుతామన్నారు. మిగిలిన షెడ్యూల్‌లో మార్పులేదని యధాప్రకారం జరుగుతుందని ఎంపిడిఒ తెలిపారు. అదపాక, బెజ్జిపురం, బుడతావలస, బుడుమూరు, చిన్నమురపాక, గోవిందపురం, తామాడ, మురపాక, గుమ్మడాం, గుర్రాలపాళెం, గురుగుబిల్లి, కేశవరాయనిపాళెం, కొత్తకోట, కొత్తకుంకాం, లక్ష్మీపురం, పేదరావుపల్లి, పెదలింగాలవలస, మురపాక 2 సచివాలయాలకు చెందిన 100 మంది పింఛనుదారులు గమనించాలని ఆయన కోరారు.


చలివేంద్రం ప్రారంభిస్తున్న హెల్పింగ్ హాండ్స్ సభ్యులు

చలివేంద్రం ఏర్పాటు

రణస్థలం: మండలంలోని రణస్థలంలో రణస్థలం హెల్పింగ్ హాండ్స్ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం బస్‌షెల్టర్ దగ్గర చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా తాగునీరు, మజ్జిగ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ వేసవిలో పాదచారులు, వాహన దారుల దాహం తీర్చేందుకు చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వేసవి కాలం అంతా చలివేంద్రం కొనసాగించడం జరుగు తుందన్నారు. అలాగే ప్రతి గ్రామంలో స్వేచ్ఛంద సంస్థలు, సేవా సంఘాలు చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పాతపట్నం: పాతపట్నం నియోజకవర్గ ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఐదు మండలాల అధికారులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేపై శిక్షణ

టెక్కలి రూరల్ : స్వామిత్వ సర్వే విజయవంతం నిర్వహించి డివిజన్ ముందు వరుసలో ఉంచాలని డిఎల్‌పిఒ గోపీబాల అన్నారు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు ఎంపిడిఒ కార్యాలయంలో స్వామిత్వ సర్వేపై శనివారం శిక్షణఇచ్చారు. కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్ విజయవంతం

ఇచ్ఛాపురం : రాజీమార్గమే సరైన మార్గమని జాతీయ లోక్ అదాలత్ ద్వారా పెండింగ్ కేసులు పరిష్కారం చేసుకోవడానికి సరైన వేదిక అని జూనియర్ సివిల్ జడ్జ్ పి.పరేష్‌కుమార్ అన్నారు. మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో జడ్జి అధ్యక్షతన జాతీయ లోక్ అదాలత్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలతో ద్వారా 130 కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. ఈ కేసులు ద్వారా జరిమానా రూపంలో రూ41300, సివిల్ సెటిల్మెంట్ కేసుల ద్వారా రూ.1.5 లక్షలు వసూలయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో న్యాయ వాదులు ఎన్.రమణయ్యరెడ్డి, సీతయ్యరెడ్డి, ఎస్.సి. సాహు దేవరాజ్‌రెడ్డి, భారతీదివ్య ఎస్.ఎల్.నారాయణ, రాంబాబు పాల్గొన్నారు.

టెక్కలి : కోర్టు ఆవరణలో జడ్జి జె.శ్రీనివాసరావు జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఫుల్ అడిషనల్ ఛార్జి జూనియర్ సివిల్ జడ్జి, డి.శ్రీభరణి అధ్యక్షతన మరో బెంచ్ ఏర్పాటు చేశారు. రెండు బెంచ్‌ల్లో కలిపి 184 కేసులు పరిష్కరించారు. అందులో సివిల్ కేసులు 4, చెక్ బౌన్సింగ్ కేసు ఒకటి, క్రిమినల్ కేసులు 47, ఎక్సైజ్ కేసులు 28, ప్లీ



ఇచ్ఛాపురం : కేసులను పరిష్కరిస్తున్న జడ్జి పరేష్ కుమార్


పొందూరు : లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి జ్యోత్స్న


బార్గయినింగ్ ద్వారా రాజీ కేసులు 101, మనోవర్తి కేసులు మూడు ఉన్నాయి. కార్యక్రమంలో డి.వి.వివేకానంద, ఎస్.ధర్మరాజు, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సోంపేట : స్థానిక కోర్టుల సముదాయం వద్ద శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో 47 కేసుల పరిష్కారమైనట్లు సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు తెలిపారు. సివిల్ కేసులు మూడు, ఎక్సైజ్ కేసులు 17, ఇతర కేసులో పరిష్కరించినట్లు తెలిపారు. రెండు బెంచ్‌ల్లో జడ్జిలు పి.పరష్ కుమార్ నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు కె.రాజు, డి.రుక్మాంద్రరావులు పాల్గొన్నారు.


పొందూరు: లోక్ అదాలత్ ద్వారా కేసులను రాజీ చేసుకోవడంతో ఇరువర్గాలకు సమన్యాయం లభిస్తుందని జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న అన్నారు. పొందూరు కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 308 కేసులను పరిష్కరించగా, ఇందులో 4 సివిల్ కేసులు, 304 క్రిమినల్ కేసులు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ మెంబర్ రాము, న్యాయవాదులు కె.రమణమూర్తి, కిరణ్‌బాబు, అశోక్ కుమార్, సంతోష్, సన్యాసప్పడు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో మెలగాలి

ఎచ్చెర్ల: పదోతరగతి పరీక్షలకు ఈ నెల 15న హాజరయ్యే విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి మంచిగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రముఖ సామాజిక, వ్యాపార వేత్త డాక్టర్ సూర శ్రీనివాసరావు అన్నారు. ఎచ్చెర్ల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష అట్టలతో పాటు పెన్నులు, పెన్సిళ్లు తదితర పరీక్ష సామగ్రిని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవితకు పదో తరగతి పునాది వంటి దన్నారు. ఇక్కడ ఉత్తమ


పంపిణీ చేసిన అట్టలతో విద్యార్థులు

మార్కులతో ప్రతిభ చాటితే ఉన్నత చదువులకు బాటలు వేసుకోవచ్చునని సూచించారు.


ఎమ్మెల్సీ శ్రీనివాస్‌పై ఫిర్యాదు చేస్తున్న మురళీమోహన్

దువ్వాడపై ఫిర్యాదు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

జిల్లాలోని టెక్కలి నియోజకవర్గానికి చెందిన వైసిపి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్‌లో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు పైడి మురళీమోహన్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల సిఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అనుచిత వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. నోటికి వచ్చినట్లు మాట్లాడుతూ అసత్య ఆరోపణలు చేశారని దువ్వాడ శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి కఠినచర్యలు తీసుకోవాలని పైడి మురళీమోహన్ పోలీసులను కోరారు. కార్యక్రమలో జనసేన మండల ఉపాధ్యక్షుడు తులగాపు ధనుంజయ్, సంఘంశెట్టి తేజేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులు పేడాడ రమణ, బొగ్గు అప్పలరాజు, గొల్లపల్లి శ్రీధర్, సతివాడ రామకృష్ణ, మురాల మిన్నారావు, మండల నాయకులు బాణాన భార్గవ్, గదిలి రమణ, నారాయణ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడు మృతి

టెక్కలి రూరల్: మండలం తొలుసూరుపల్లి పంచాయతీ ధర్మనీలాపురానికి చెందిన గురువెల్లి కృష్ణారావు (65) శనివారం రాత్రి రైలు ఢీకొని మృతిచెందాడు. స్థానికుల వివరాల మేరకు గ్రామానికి చెందిన కృష్ణారావు రైలు పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడని చెప్పారు. అనంతరం కుటుంబీకులకు సమాచారం తెలిపారు.. దీనిపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాన్ బోల్తా

ఎచ్చెర్ల: మండల పరిధిలో ఫరీద్‌పేట పంచాయతీ వద్ద రోడ్డు ప్రమాదంలో ద్రాక్షపళ్ల వ్యాన్ బోల్తా పడింది. ఎస్ఐ వి.సందీప్ తెలిపిన వివరాల మేరకు రాజమండ్రి నుంచి పశ్చిమ బెంగాల్ రాష్ట్రం మాల్దా వెళ్తున్న ద్రాక్ష పళ్ల వ్యాన్ ఫరీద్‌పేట కూడలి వద్దకు వచ్చేసరికి అదుపు తప్పి డివైడర్ ఎక్కి సర్వీస్ రోడ్‌లో బోల్తా పడింది. ఈ సంఘటనలో వ్యాన్‌లో ఉన్న ద్రాక్ష పళ్లు చెల్లచెదురయ్యాయి. వ్యాన్‌లో ఉన్న డ్రైవర్ సంతోష్ తకారం, బాబాయ్ వ్యాన్ యజమాని మదకర్ మహదేవ్ మహారంగ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ఘటన జరిగిన సమయంలో సర్వీస్ రోడ్డులో ఎటువంటి వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఎస్ఐ సందీప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాటుసారాతో వ్యక్తి అరెస్టు

కొత్తూరు : మండలంలోని జొన్నగూడ చెందిన సవర బుడ్డయ్య 20 లీటర్ల నాటుసారా తరలిస్తుండగా మెట్టూరు- ఇరపాడు కూడలి వద్ద శుక్రవారం పట్టుకున్నామని ఎస్ఐ మహ్మద్ అమీర్ అలీ తెలిపారు. వ్యక్తిని అరెస్టు చేసి నాటుసారాను స్వాదీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని స్థానిక మెజిస్ట్రేట్ కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

కొత్తూరు : వరకట్న వేధింపులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ మహ్మద్ అమీర్ ఆలీ శనివారం తెలిపారు. మండలంలోని కలిగంకు చెందిన కూన సంతోష్‌కుమారి మెట్టురుకు చెందిన అశోక్‌కుమార్‌లకు 8 ఏళ్ల క్రితం వివాహమైందన్నారు. వీరికి ఇద్దరు సతానం తెలిపారు. కొద్ది రోజుల క్రితం సంతోష్‌కుమారి అత్త శారద, మామ కృష్ణారావు, మరిది మోహనరావులు అదనపు కట్నం తేవాలని వేధిస్తున్నారని అన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గంజాయి విక్రయదారునిపై కేసు

ఆమదాలవలస: పట్టణంలోని రైల్వేస్టేషన్ జంక్షన్ వద్ద పాన్‌షాప్ నడుపుతున్న పొట్నూరు కృష్ణారావు వద్ద 70 గ్రాముల గంజాయి దొరకడంతో కేసును నమోదు చేసి కోర్టులో హాజరు పరచినట్లు ఎస్ఐ సనపల బాలరాజు తెలిపారు. గత సోమవారం గంజాయితో పట్టుబడితే విచారణ పేరుతో ముద్దాయిపై కేసు నమోదు చేయకుండా శనివారం హడావుడిగా కేసు నమోదు చేసినట్లు పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజా వారధితో సమస్యలు పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

సమస్యల పరిష్కారానికి ప్రజావారధి కార్యక్రమం చేపడుతున్నామని స్థానిక ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు స్పష్టం చేశారు. ప్రజలు, కూటమి నాయకులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు సంబంధిత అధికారులతో చర్చించి ప్రాధాన్యతా క్రమంలో సమస్యలు పరిష్కరిస్తామన్నారు. దశల వారీగా సమస్యలు పరిష్కరించి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. శనివారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రజావారధి కార్యక్రమం నిర్వహించి వినతులు స్వీకరించారు. నారాయణపురం కుడికాలువ ఆధునికీకరణ పనులు పూర్తి చేసి శివారు రైతాంగానికి సాగునీరు అందించాలని కూటమి నాయకులు వినతిపత్రం ఆందించారు. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు పైడి వేణుగోపాలం, టిడిపి జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, మాజీ జెడ్‌పిటిసి గొర్లె లక్ష్మణరావు, కూటమి నాయకులు పిసిని జగన్నాథం నాయుడు, ముప్పిడి సురేష్, బెండు మల్లేశ్వరరావు, సంపతిరావు నాగేశ్వరరావు, గాలి వెంకటరెడ్డి, లుకలాపు అప్పలనాయుడు, బొట్ల భాస్కరరావు, పిసిని హరికృష్ణ, లెంక శ్యామలరావు, పిన్నింటి బానోజీనాయుడు తదితరులున్నారు.

ఆమదాలవలస: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ అన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో వివిధ రకాల సమస్యలపై ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. నియోజకవర్గంలోని ఆమదాలవలస రూరల్, అర్బన్, బూర్జ, సరుబుజ్జిలి మండలాలకు చెందిన ప్రజల నుంచి పింఛన్ల కోసం 107, గృహ నిర్మాణం కోసం 27, నూతన రేషన్‌కార్డుల కోసం 28, రెవెన్యూ, పోలీస్, ఎడ్యుకేషన్ తదితర సమస్యలపై 14 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు సంపదరావు మురళీ, శివ్వాల సూర్యం, ఆనెపు రామకృష్ణ, పల్లి సురేష్, అంబళ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

నరసన్నపేట: మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. గత సోమవారం నరసన్నపేట పట్టణంలో గంజాయి తాగి యువకుడు చేసిన హత్యపై ఖండిస్తూ.. వారి కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా గంజాయి రహిత ప్రాంతంగ తీర్చిదిద్దేందుకు కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణనాయుడు, టిడిపి మండల అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, పార్లమెంట్ పార్టీ అధికార ప్రతినిధి గొద్దు చిట్టిబాబు, పధాన కార్యదర్శి అడపా చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి టీకాలు తప్పనిసరి

కోటబొమ్మాళి: పాడిరైతులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పని సరిగా వేయాలని స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్ అన్నారు. జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని బాపన్నపేట, యలమంచిలి, బాలరాంపురం గ్రామాల్లో 332 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు కె.ముకుందరావు, శోభ పాల్గొన్నారు.



శ్రీనును పరామర్శిస్తున్న తిలక్

తిలక్ పరామర్శ

కోటబొమ్మాళి: మండలంలోని కురుడకు చెందిన వైసిపి నాయకులు మెండ శ్రీను తండ్రి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న టెక్కలి వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ శనివారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే సంతబొమ్మాళి మండలం నర్సాపురానికి చెందిన వైసిపి నాయకులు మోడీ భాస్కరరావు తండ్రి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయననూ పరామర్శించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు అన్నెపు రామారావు, మండల పార్టీ అధ్యక్షులు సంపతిరావు హేమసుందరరాజు, పేడాడ వెంకటరావు, దుబ్బ వెంకటరావు, పొన్నాన మోహనరావు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

వివాహానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని మాకన్నపురానికి చెందిన దట్టి అనిత వివాహానికి స్థానిక ఎంఎన్ఆర్ యువసేన సభ్యులు రూ.50 వేలు ఆర్థికసాయం శనివారం అందజేశారు. అనిత తండ్రి అనారోగ్యంతో మృతి చెందగా, తల్లి జయమ్మ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంది. కుమార్తెకు వివాహం నిశ్చయం కావడంతో సమాచారం తెలుసుకున్న ఎంఎన్ఆర్ యువసేన సభ్యులు తమ చేయూత అందించారు. కార్యక్రమంలో మద్దిల నాగేశ్వరరావు, ఎన్.శ్యామలరావు, ఎం.కోదండరావు, యు.హరికృష్ణ, బి.దుర్గారావు, ఎం.కోదండరావు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలతో పనుల్లో పారదర్శకత



గ్రామసభలో పాల్గొన్న అధికారులు, నాయకులు

ప్రజాశక్తి- పొందూరు

గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి పనుల్లో అవినీతికి తావులేకుండా పారదర్శకంగా నిర్వహించేందుకు సామాజిక తనిఖీలు ఉపయోగ పడతాయని ఎస్ఆర్‌పి పున్నపునాయుడు అన్నారు. మండల కేంద్రం పొందూరు పంచాయతీలో జరిగిన ఉపాధి పనులపై నిర్వహించిన గ్రామసభలో మాట్లాడారు. పంచాయతీ పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జాతీయ ఉపాధి హామీ పనులతో పాటు పలు విభాగాలకు చెందిన 111 పనులకు సంబంధించి రూ.1.59 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. ఇందులో వేతనాల రూపంలో రూ.1.42 కోట్లు, మెటీరియల్ రూపంలో రూ.17.48 లక్షలు ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు. ఈ పనులకు సంబంధించి కూలీలకు వేతనాలు అందుతున్నవి లేనివి, అర్హులకు జాబ్ కార్డులు అందుతున్నవి లేనివి, పనుల నాణ్యత గుర్తించి అధికారులకు నివేదిక ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.లక్ష్మి, ఎపిఒ శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు రామ్మోహన్, ఎంపిటిసి ప్రతినిధి బాడాన శేషగిరి, ఇఒ మోహన్ బాబు, డిఆర్‌పిలు, సామాజిక తనిఖీ సిబ్బంది, గ్రామస్తులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

శాంతారాం మాస్టర్ సేవలు చిరస్మరణీయం



చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- పొందూరు

సమాజసేవే శ్వాసగా తన చివరి ఘడియల వరకు జీవించిన వ్యక్తి కాళ్లకూరి శాంతారాం మాస్టర్ అని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలో గ్రామస్తులు, ప్రజాసంఘాలు, కళారంగం సభ్యులు నిర్వహించిన శాంతారాం మాస్టర్ సంతాప సభలో మాట్లాడారు. సమాజానికి, కళారంగానికి, ఆధ్యాత్మిక రంగాలకు ఆయన అందించిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. పొందూరు పట్టణానికే కాకుండా మండలానికి తన సేవలను అందించారన్నారు. ఎన్నో గ్రామాల్లో యువత స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటుకు శాంతారాం మాస్టర్ స్ఫూర్తి అని అన్నారు. శాంతారాం కుటుంబానికి తాను ఎప్పుడు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సంతాప సభలో మండల అధ్యక్షులు చిగులపల్లి రామ్మోహన్, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కూన వెంకట సత్యనారాయణ, సర్పంచ్ రేగడి లక్ష్మి, టిడిపి నాయకులు బాడాన శేషగిరి, బలగ శంకర్ భాస్కర్, పైడితల్లి అమ్మవారి ఆలయ ట్రస్ట్ సభ్యులు, యంగ్ స్టార్స్ సంస్థ సభ్యులు, ప్రజా సంఘాల సభ్యులు, నాటక రంగానికి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ జాతర



గిరిబాబుకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు జ్యోత్స్న

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీ 23వ వార్డు ఎల్లమ్మ వీధిలో శనివారం ఘనంగా జామి ఎల్లమ్మ జాతర నిర్వహించారు. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలతో పాటుగా పలాస, మందస, వజ్రపుకొత్తూరు, మెళియాపుట్టి, పాతపట్నం, టెక్కలి, నందిగాం మండలాలు, ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాల నుంచి యాత్రికులు బారులు తీరారు. ఈ సందర్భంగా పలాస జీడి పిక్క బొమ్మ వద్ద లయన్స్ క్లబ్ వనిత, డాక్టర్ టి.బాలకృష్ణ తన సొంత నిధులతో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జ్యోత్స్న పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, లయన్స్ క్లబ్ సంస్థలు పలు ప్రాంతాల్లో మజ్జిగలు, తాగునీటి ప్యాకెట్లు, కర్బూజ వంటివి భక్తులకు అందించారు. కాశీబుగ్గ సిఐ సూర్యనారాయణ ఆధ్వర్యాన పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మాజీ మంత్రి గౌతు శివాజీ, ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు ఆలయాన్ని దర్శించారు. వారితో పాటు టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు గురిటి సూర్యనారాయణ గాలి కృష్ణారావు మల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శంకర్

ఛత్తీస్‌ఘడ్ తెలుగు మహాసభకు ఎమ్మెల్యే

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాయపూర్‌లో తెలుగు మహా సంఘం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న తెలుగు మహాసభల్లో ప్రత్యేక అతిథిగా శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ హాజరయ్యారు. సుప్రీంకోర్టు పూర్వపు చీప్ జస్టిస్ వెంకటరమణ, తెలుగు భాషా సంఘం నాయకులు, జనసేన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి పాల్గొన్నారు. తెలుగుబాష ఔన్నిత్యాన్ని ఆయన సభలో కొనియాడారు. అంతర్జాతీయ స్థాయిలో తెలుగు వారి గుర్తింపు పెరిగిందని అన్నిరంగాల్లో పురుషులతో పాటు తెలుగు మహిళలు పోటీ పడుతూ ముందుకు వెళు ్తన్నారన్నారు. తెలుగు భాష గొప్పతనాన్ని జాతీయ, అంతర్జాతీయ వేదికలపై చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం

ప్రజాశక్తి- రణస్థలం

ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు కంప్యూటర్ జ్ఞానం సామర్థ్యం చాలా అవసరమని శ్రీసాయి సుధా కంప్యూటర్స్ ట్రైనర్ పి.చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ అక్షరాస్యత అంటే కంప్యూటర్లు, సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించుకునే జ్ఞానం, సామర్థ్యం ఇది కలిగి ఉండటం చాలా ముఖ్యమైన నైపుణ్యంగా పరిగణించబడుతుందన్నారు. కంప్యూటర్ అక్షరాస్యత అనేది కంప్యూటర్ ప్రోగ్రామ్‌లు, కంప్యూటర్‌లతో అనుబంధించబడిన ఇతర అప్లికేషన్‌లను ఉపయోగించడంలో ఎవరైనా కలిగి ఉన్న సౌకర్య స్థాయిని కూడా సూచిస్తుందన్నారు. రణస్థలం, లావేరు మండలాలకు చెందిన వేలాది మంది విద్యార్థులకు అతి తక్కువ ఫీజుతో కంప్యూటర్ శిక్షణలో ప్రాథమిక కోర్సు అందిస్తున్నామన్నారు.



ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న అధికారులు

ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై జిల్లాస్థాయి శిక్షణ

ఎచ్చెర్ల: మండలంలో ఉన్న టిటిడిసి భవనం వద్ద జిల్లాస్థాయి ప్రకతి వ్యవసాయం ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ రేవతి మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతులు జిల్లాలో ఉన్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అందరికీ ఆరు రోజుల పాటు నిర్వహించబడతాయని తెలిపారు. ఇందులో ప్రధానంగా రానున్న ఖరీఫ్ సీజన్‌కు ముందుగా రైతులతో నవధాన్య సాగు పద్ధతులు అవగాహన, గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ప్రతి రైతుకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ఉండేలా ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయడానికి అవసరమైన శిక్షణలను సిబ్బందికి ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డిపిఎం ధనుంజయరావు, ఎన్ఎఫ్ఎస్, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

'ఆస్తుల వివాదం కోర్టులో ఉంది'

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన బల్ల నర్శింహమూర్తి ఆస్తుల వివాదం సొంపేట కోర్టులో కేసు నడుస్తుందని, వారుడు శ్రీనివాసరావు ఒక ప్రకటనల తెలిపారు. ఈ ఆస్తులపై తాము స్టేటస్ కో కూడా తెచ్చుకున్నామని, ఈ భూములపై అధికారులు ఎవరి ఒత్తిళ్లకు లొంగి తప్పుడు ధ్రువపత్రాలు అందించిస్తే సంబంధిత అధికారులపై కోర్టులో కేసులు వేస్తానని హెచ్చరించారు.